RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 298 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | శుక్రవారం 18 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

## కీసర పోలీస్ స్టేషన్‌లో ఏసీబీకి అడ్డంగా దొరికిన కీసర సీఐ, ఎస్ఐ!

**హైదరాబాద్,సెప్టెంబర్,17:**తెలంగాణలో ఇద్దరు పోలీసు అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసి, స్వీకరించిన కేసులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్/ఎస్‌హెచ్‌ఓ అర్కపల్లి ఆంజనేయులు, సబ్-ఇన్‌స్పెక్టర్ ద్యాప జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు గురు వారం అరెస్ట్ చేశారు. ఒక కేసులో స్టేషన్ బెయిల్ మంజూ రు చేయడంతో పాటు బాధితుడిని, అతని స్నేహితుడిని ఇకపై వేధించకుండా ఉండేందుకు ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తమ ప్రకటనలో వెల్లడించింది.

## రష్యా నుంచి ఆయిల్ కొనొద్దు.. భారత్‌కు అమెరికా అల్టిమేటం..

రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనావంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే, అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదు ర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. "భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చల వైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఖైరతాబాద్ గణపతికి
# ప్రత్యేక పూజలు చేసిన హరీశ్ రావు..

**హైదరాబాద్,సెప్టెంబర్,17:**భాగ్యనగరం నడిబొడ్డున కొలువైన ప్రపంచ ప్రసిద్ధ ఖైరతాబాద్ పంచముఖ సంకట మహాగణపతిని బీజేపీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు దర్శించుకున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి ఆయన స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... చార్మినార్, గోల్కొండ కోటల మాదిరిగానే హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను నలుదిశలా సగర్వంగా చాటడంలో ఖైరతాబాద్ వినాయకుడి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. కేవలం పరిమాణంలోనే కాక, భక్తుల నమ్మకంలోనూ ఇది 'బడియా గణేశ్'గా నిలిచిందని అభివర్ణించారు. ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తులో పూర్తిగా మట్టితో రూపుదిద్దుకున్న పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించి ఉత్సవ కమిటీ పర్యావరణ పరిరక్షణకు గొప్ప సందేశమిచ్చిందని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి ముప్పు లేని మట్టి వినాయకులనే పూజించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు ఉత్సవాలను ఎంత వైభవంగా నిర్వహిస్తున్నామో, నిమజ్జన ఘట్టంలోనూ అంతే అప్రమత్తత అవసరమని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల



పటాన్‌చెరు పరిధిలో నిమజ్జనం సమయంలో చోటుచేసుకున్న విషాదకర సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ముందస్తుగా ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ సమితులు సమన్వయంతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, భక్తులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరుకున్నారు.

# 2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..

## కేసీఆర్ భూములపై సంచలన విషయాలు బయటపెట్టి పొంగులేటి



**హైదరాబాద్,సెప్టెంబర్,17:**ఎన్నికల అఫిడవిట్‌తో కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికిపోయిందని సున్నా ఎకరాల నుండి వేల కోట్ల విలువైన ఆస్తులకు ఎదిగిన భూ బకాసురుడు కేసీఆర్ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. తనకు ఒక్క ఎకరం కూడా భూమి లేదని2004 కరీంనగర్ లోక్ సభ ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాలు భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. గతంలో కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌ను ఎక్స్ లో షేర్ చేస్తూ.. తెలం గాణ ఉద్యమ సమయంలో,ఆతరువాత అధికారంలో ఉన్న పదేండ్లలో కేసీఆర్‌కు భూములు భారీగా పెరిగిన విషయం, స్వయంగా కేసీఆర్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌ల ద్వారా స్పష్టమవుతుందన్నారు. బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు, తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే కేసీఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. ఇదంతా ప్రభుత్వ, పేదల, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం ద్వారానే కదా అని ప్రశ్నించారు. ఉద్యమకారులత్యాగాల పునాదుల మీద కల్వకుంట్ల కుటుంబంలక్షల కోట్ల ఆస్తులను అక్రమంగా సంపాదిం చుకుంటే డ్రామారావు (కేటీఆర్) మాత్రం పుట్టుకతోనే కేసీఆర్?కు వందల ఎకరాలు ఉన్నాయని బొంకుతున్నారని మండిప డ్డారు. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు రాసి మోసం చేసారా? లేక, ప్రజలకు అబద్దాలు చెప్తున్నారా అని నిలదీశారు.

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..
# తీవ్రంగా స్పందించిన కేటీఆర్

**- కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం- మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం- పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన- మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్- సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై



అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

# వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం..

## పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

**- అమరవీరులకు నివాళులర్పించిన రేవంత్ రెడ్డి- సామాజిక న్యాయమే పునాదిగా పాలన అందిస్తున్నామన్న సీఎం- రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు**

**హైదరాబాద్,సెప్టెంబర్,17:**తెలంగాణ వ్యాప్తంగా 'తెలంగాణ ప్రజా పా లన దినోత్సవ' వేడుకలు సెప్టెంబర్ 17న అత్యంత వైభవంగా జరుగు తున్నాయి. హైదరాబాద్ నాంపల్లిలోని చారిత్రాత్మక పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పబ్లిక్ గార్డెన్స్‌కు చేరుకునే ముందు గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను స్మరిస్తూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో పోలీసు బలగాల నుంచి రేవంత్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా సీఎం ప్రసంగిస్తూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, స్వేచ్ఛ, సామాజిక న్యాయమే పునాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన 'ప్రజా పాలన'ను అందిస్తోందని స్పష్టం చేశారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో




ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు

## రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్

**తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి**
**రజాకార్ల ఘోరాలను గత పాలకులు తొక్కిపెట్టారని మండిపాటు**
**ఎంఐఎంకు అనుకూలంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శ**

**హైదరాబాద్,సెప్టెంబర్,17:**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో రజాకార్లు జరిపిన నరమేధం, ఘోరాలను గత పాలకులు చరిత్ర పుటల నుంచి తొక్కిపెట్టారని మండిపడ్డారు. చరిత్రను ఎంత



దాచాలని చూసినా సత్యం దాగిపోదని స్పష్టం చేశారు. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## డోర్నకల్ ఎమ్మెల్యే కారులో మంటలు.. త్రుటిలో తప్పిన ప్రమాదం

డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్ర నాయక్‌కు పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే సురక్షితంగా బయటపడగా, ఆయన కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరారు. కారులో ఉన్న పవర్ బ్యాంక్ పేలడంతో కేబిన్‌లో మంటలు వేగంగా వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన ఎమ్మెల్యే, సిబ్బంది కారును నిలిపివేసి కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

# కేంద్ర నిధులతో వచ్చే నాణ్యమైన విద్యను నిరాకరిస్తారా.. తమిళనాడు సర్కార్‌పై సుప్రీంకోర్టు అసహనం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,17:**తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు పై సుప్రీంకోర్టు (ాబజూతీవఎవ జశీబతీ) కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా, నవోదయ పాఠశాలల ద్వారా హిందీ భాషను బలవంతంగా రుద్దుతున్నారంటూ తమిళనాడు లేవనెత్తిన ఆరోపణలను న్యాయస్థానం తోసిపుచ్చింది. త్రిభాషా విధానం కింద ప్రాంతీయ భాష, ఆంగ్లం తో పాటు ఏదైనా మూడో భారతీయ భాషను బోధించవచ్చని, అది కచ్చితంగా హిందీ మాత్రమే అయి ఉండాల్సిన నిబంధన ఏమీ లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం పూర్తి నిధులు సమకూరుస్తున్నప్పుడు, కేవలం భూమి కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిరాకరిస్తోందని ధర్మాసనం ప్రశ్నించింది. కేంద్ర పథకం అనే కారణంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను నిరాకరించడం సరైంది కాదని హితవు పలికింది. అదే సమయంలో విద్యార్థులపై



ఒత్తిడిని తగ్గించేందుకు మూడో భాషను 9వ తరగతిలో కాకుండా, 5 లేదా 6వ తరగతి నుంచే ప్రవేశపెట్టి ముందుగానే ముగించేలా విధానాలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి ధర్మాసనం సూచించింది. నవోదయ విద్యాలయాల ఏర్పాటుపై కేంద్రంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వానికి న్యాయస్థానం స్పష్టం చేసింది.

## ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా షురూ.. గ్రాడ్యుయేట్స్‌కు కీలక అలర్ట్

**హైదరాబాద్,సెప్టెంబర్,17:**తెలంగాణ రాష్ట్రంలోని రెండు ప్రధాన పట్టభద్రుల (గ్రాడ్యుయేట్స్) ఎమ్మెల్సీ నియోజకవర్గాల స్థానాలు మార్చి 2027లో ఖాళీ కానున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ , వరంగల్--ఖమ్మం--నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలకు కొత్తగా ఓటరు నమోదు షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వెల్లడించారు. ఎన్నికల సంఘం ప్రకటించిన కార్యచరణ ప్రకారం నవంబర్ 1, 2026 నాటికి విద్యార్హత సాధించిన పట్టభద్రులందరూ ఓటరు నమోదుకు అర్హులుగా ఉంటారు. ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి సెప్టెంబర్ 28న అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. అర్హులైన అభ్యర్థులు నవంబర్ 6 వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఆ తర్వాత అధికారులు ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను నవంబర్ 25న ప్రచురిస్తారు. ఈ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు లేదా సవరణల కోసం నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు సమయం కేటాయించారు. అభ్యంతరాలన్నింటినీ పరిశీలించి పరిష్కరించిన అనంతరం డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతిసారి పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ మార్గాల్లో సమర్పించవచ్చు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలనుకునే వారు సీఈఓ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు

# సంపాదకీయం

## ఇది ఉద్వేగం కాదు.. మనిషిలో దాగిన క్రూరత్వం!

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు కేవలం చట్టపరమైన సమస్యలు మాత్రమే కావు. ఈ నేరాల వెనుక దాగి ఉన్న క్రూర మనస్తత్వం, సామాజిక వైఫల్యాలు, నైతిక సంక్షోభం గురించి విశ్లేషించే కథనం. చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, వాటి తర్వాత వెలుగులోకి వస్తున్న అమానుష హింస, హత్యలు సమాజాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి. ప్రతి సంఘటన తర్వాత ఒకే రకమైన ఆవేదన వ్యక్తమవుతోంది. కొవ్వొత్తుల ర్యాలీలు జరుగుతున్నాయి. న్యాయం కోసం నినాదాలు వినిపిస్తున్నాయి. కఠిన శిక్షల కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి. కానీ ఈ ఆగ్రహం, దుఃఖం , ఆందోళనలు, మానసిక సంఘర్షణలు అసలు మూలాన్ని వెతకడంలో అలసిపోతున్నాయి . ఇలాంటి నేరాలకు పాల్పడే వ్యక్తుల మానసిక ప్రవృత్తి ఏమిటి? అది ఒక్క క్షణపు ఉద్వేగమా? లేక వారి వ్యక్తిత్వంలోనే దాగి ఉన్న ఏదైనా చీకటా? లేదా వారి జీవితం, వారి స్వతః సిద్ధ మానసిక కోణం ఇలాంటప్పుడే బయటపడుతోందా!? ఇన్నాళ్లు మనం దానిని ఇగ్నోర్ చేశామా? ఇవే ఆ మూలాలు.. ఇలాంటి నేరాలు జరగగానే ఆ క్రూరుడిని ఒక గాటన కట్టేస్తాం "అదుపు తప్పిన కోరిక", "క్షణిక ఉద్వేగం", "ఆవేశం" వంటి అనేక పొరల మాటున అతను చేసిన గాయాన్ని మర్చిపోతున్నాం. కానీ వయసుతో సంబంధం లేకుండా, పరిస్థితుల అంశం లేశ్యమాత్రమైనా లేకుండా చిన్నారులపై, మహిళలపై, జరిగే అత్యాచారాలను, వాటి తర్వాత జరిగే హత్యలను పరిశీలించినప్పుడు ఇవన్నీ అసంపూర్ణాలు కదా!. అవును ఒకవేళ అది నిజంగానే ఒక్క క్షణపు ఉద్వేగమే అయితే, ఆ దారుణ కృత్యానికి ముందూ, వెనుకా కనిపించే పాశవిక హింస సంగతి ఏమిటి? చిన్నారి భయాన్ని చూస్తూ, చిన్నారి లేదా ఆమె అసహాయతను గమనిస్తూ, ఆ బాధను గ్రహిస్తూ కూడా తనను తాను మనిషిగా మరచిపోయి మృగత్వాన్ని కొనసాగి ంచడం ఏ రకపు ఉ ద్వేగం? తన తనకాలమాన పరిస్థితులు, తన సోషల్ స్టేటస్, అందులో తాను అప్పటివరకూ పొందిన పేరు అన్నీ వదిలేసి కేవలం తన పశుత్వాన్ని మాత్రమే తాను నిరూపించుకోవడానికి సిద్ధపడటం ఏమిటి !

పోనీ నేరం జరిగిన తర్వాత అయినా తనను తాను గుర్తిస్తున్నారా? హత్యలకూ దిగుతున్నారు అదీ అత్యంత కర్కశంగా.. ఎవిడెన్స్‌ను చెరిపేయడానికి తొక్కకూడని దారులు తొక్కుతూ ఒక తప్పుకు వంద తప్పులు చేస్తూ పోతున్నారు? బయటపడతాననే భయంతో బాధితులకు ఇంకా ఇంకా నరకం చూపెడుతున్నారు. అసలిక్కడి వాస్తవం క్షణిక ఉద్వేగం కాదు. అతని లోపలి ఎన్నో రోజుల క్రూరత్వం. ఒక చిన్నారి కన్నీళ్ల కంటే తన కోరిక పెద్దదిగా కనిపిస్తోంది, ఒక చిన్నారి ప్రాణం కంటే తన రక్షణ ముఖ్యమైపోతోంది, ఎదుటివారి బాధను గుర్తించలేని నైతిక పతనం ఇది. ఒక మనిషి మరొక మనిషిని మనిషిగా చూడలేని స్థితి ఇది. సైకాలజీ దీనిని మానవత్వాన్ని హరించడంగా నిర్వచిస్తుంది. అంటే ఎదుటివారి వ్యక్తిత్వం, హక్కులు, బాధ అన్నీ అదృశ్యమై, అతను లేదా ఆమె కేవలం ఒక వస్తువుగా మారిపోవడం, తన ఆనందం, తన మానసిక వికారం తీర్చుకోవడానికి వారు ఒక ఆటబొమ్మగా వీరి దృష్టికి కనిపించడం. పోనీ ఇది క్షణకాలపు ఉద్వేగం కాదు, ఇది వారి వ్యక్తిత్వంలో భాగమే అనుకుంటే, అటువంటి వ్యక్తులను మనం ఎలా గుర్తించాలి? ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఇలాంటి నేరాలు చేసే వారు మనకేం రాక్షసుల్లా కనిపించరు. వారి ముఖాలపై క్రూరత్వం రాసి ఉండదు. వారు కుటుంబ సభ్యులుగా, బంధువులుగా, పొరుగువారిగా, సహోద్యోగులుగా, కొన్నిసార్లు సమాజంలో అత్యంత గౌరవనీయులుగా కూడా ఉంటారు."అతను అలాంటి వాడని అనుకోలేదు." అనేంత మంచివాడిగా మన మధ్య తిరుగుతూ మనతోనే జీవిస్తుంటారు. ఇదే ఇప్పటి సమాజం ఎదుర్కొంటున్న అసలైన సవాలు, ఒకానొక చీకటిని గురించిన భయం. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు. మనుషులను అర్థం చేసుకునే మన సామర్థ్యపు సమస్య, విలువల సమస్య. మనం చూసేది ఒక పబ్లిక్ ఇమేజ్‌ని మాత్రమే అయితే? మనకు కనిపించని అతని మరో ప్రపంచం!? ఆ చీకటిని ముందుగానే గుర్తించలేని మన నమ్మకం!? ఇవన్నీ ప్రశ్నలే. మనం చేస్తున్న కొవ్వొత్తుల ర్యాలీలతో మనతో నిలబడ్డ వ్యక్తుల అసలు రంగు మనం చూసేది ఎలా!? వారి అంతర్ముఖ చిత్రాలు చిత్రించేది ఎలా!? అందుకే చిన్నారులపై జరిగే లైంగిక హింసను కేవలం చట్ట పరమైన సమస్యగా చూడలేం. అది సామాజిక సమస్య. నైతిక సమస్య. మానసిక సమస్య. అంతకన్నా ముందు అది ఒక నాగరికత సంక్షోభం. ఎందుకంటే ఒక చిన్నారి ప్రపంచాన్ని మొదటిసారి విశ్వసించడం నేర్చుకుంటున్న సమయంలో, అదే ప్రపంచం ఆమెకు భయంగా మారకూడదు. ఒక మనిషిని నమ్మడం నేర్చుకుంటున్న సమయంలో, అదే మనిషి ద్వారా తను ప్రమాదంలో పడకూడదు. ఎందుకంటే ఈ నేరాలు కేవలం శరీరాలను గాయప ర చవు. అవి నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తాయి తన కుటుంబాన్ని, తన చుట్టూ ఉన్న ఏ ఒక్క మనిషినీ ఆ చిన్నారి నమ్మలేని స్థితికి తీసుకు వస్తాయి.. ఇది ఆ కుటుంబాన్ని మాత్రమే కాదు, సమాజపు సామూహిక అంతరాత్మను కూడా దెబ్బతీస్తుంది.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# నగర నడిబొడ్డున యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణ హత్య

**- కారులో వచ్చి కత్తితో పొడిచి చంపిన వైనం**
**- వైష్ణవి హత్యకు ప్రతీకారంగానే ఈ హత్య జరిగినట్లు అనుమానం**





**నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 17 (ప్రజా గళం )** నిజామాబాద్ నగరం నడిబొడ్డున యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు దారుణ హత్యకు గురయ్యాడు. వైష్ణవి హత్యకు ప్రతీకారంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికశీగా అంచనా వేశారు. ఆరు నెలల క్రితం జరిగిన వైష్ణవి హత్య తరువాత ఆమె బంధువులు ఆగ్రహాశీతో రగిలిపోతున్నారు. ఈ తరహాలోనే పక్కా ముందస్తు ప్రణాళికతో కారులో వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి చంపారు. ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని ఉషా మయూరి మల్టీప్లెక్స్ థియేటర్ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇటీవల రాష్ట్రంలో సంచలనం సృష్టించిన యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో ఆమె భర్త హరిబాబు నిందితుడుగా ఉన్నట్లు తెలిసింది. వైష్ణవి హత్యకు ప్రతీకారంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. వైష్ణవి ని అనుమానంతో హత్య చేసినట్లు కేసు నమోదు కాగా అతనిని అరెస్టు చేశారు. ఇటీవలే బెయిల్ పై బయటకు వచ్చిన హరిబాబు నిజామాబాద్ లో ఉన్నట్లు సమాచారం అందుకున్న వైష్ణవి తరపు బంధువులు హరిబాబును మాటు వేసి అతి దారుణంగా కత్తితో పొడిచి హత్య చేసినట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించిన ఈ హత్య కేసు పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్ పరిశీలించి హత్య జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. హత్య చేసిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. హత్య జరిగిన ప్రాంతంలోని సీసీ ఫుటేజ్ ను పోలీసులు పరిశీలించారు. కారు లోంచి ఓ వ్యక్తి బయటకు వచ్చి కత్తితో పొడిచి అదే కారులో పరారైనట్లు సీసీ ఫుటేజ్ లో రికార్డ్ అయింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**- డి ఈ ఓ అశోక్**




**ఆర్మూర్ సెప్టెంబర్ 17 (ప్రజా గళం)**చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్య అధికారి అశోక్ స్పష్టం చేశారు. గురువారం మామిడిపల్లి గ్రామంలో ఆర్మూర్ మండల, రూరల్ క్రీడా పోటీల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా డి ఈ ఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డీఈవో అశోక్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ,శారీరిక దృఢత్వానికి ఎంతగానో దోహద పడతాయన్నారు. క్రీడల్లో రాణించినప్పుడే ప్రభుత్వం ప్రోత్సాకాన్ని అందిస్తుందన్నారు. క్రీడల్లో దేశానికి ,రాష్ట్రానికి పథకాలు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రీడిల్లో గెలుపొందిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగుల్లో అవకాశం కల్పిస్తుంది అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఉత్సాహాన్ని చూపించాలన్నారు .ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు చేపట్టిన మార్చ్ ఫాస్ట్ లో ప్రతిభ కనబరిచిన నలంద, విజయ్ పాఠశాల ల విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీందర్, నలంద పాఠశాల కరస్పాండెంట్ నలంద ప్రసాద్, నలంద సాగర్, కౌన్సిలర్ దినేష్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞం మహోత్సవం






**నిజామాబాద్, సెప్టెంబర్ 17 ( ప్రజాగళం ప్రతినిధి )** భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు హాజరై, భగవాన్ శ్రీ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. విశ్వ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, విశ్వకర్మ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ కార్యాలయం ఆవరణలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**- జాతీయ జెండాను ఆవిష్కరించిన సీపీ సాయి చైతన్య**





**నిజామాబాద్ ( ప్రజాగళం ప్రతినిధి )** తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ లైన్ ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు స్వీట్ ప్యాకెట్స్ మరియు నోట్ బుక్స్ లు , పెన్ లు పంపిణీ చేశారు. ఈ వేడుకలలో అదనపు డి.సి.పి (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్,ఎ.ఆర్. ఎ.సి.పి కృష్ణ ,ట్రాఫిక్ ఎ.సి.పి మస్తాన్‌అలీ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి,సి.ఐ లు,ఆర్.ఐలు , ఎస్.ఐ లు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది,ఐటి కోర్ , సెంట్రల్ కాంప్లె సెల్ , స్పెషల్ బ్రాంచ్ , సిసిఆర్.బి , సైబర్ క్రైమ్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలో కుటుంబ రాజకీయాలు సమీకరణలు!



**విజయవాడ,** : వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోరుకుంది ఆ ఫ్యామిలీ. అందుకు పార్టీ హై కమాండ్ అంగీకరించకపోవడంతో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కేసుల రూపంలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది.. ఆ ఫ్యామిలీ మద్దతుతోనే పార్టీని ఏర్పాటు చేశారు. తొలి ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా సీట్లు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల, బాబాయ్ వివేకానంద రెడ్డి, సోదరులు అవినాష్ రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటే ఆ ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది. అయితే అదే సమయంలో టిడిపిలో చూస్తే మాత్రం చంద్రబాబుతో పాటు లోకేష్ కు సొంత కుటుంబం దన్ను అంతగా లేకపోయింది. కానీ ఇప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండ తగ్గింది. చంద్రబాబుకు గణనీయంగా పెరుగుతూ వస్తోంది.తెలుగుదేశం అధినేత చంద్రబాబు విషయంలో కుటుంబ
పరంగా ఒక భిన్న వాతావరణం ఉండేది. నందమూరి హరికృష్ణ అండగా నిలిచేవారు. కానీ అదే సమయంలో రెబల్గా కూడా వ్యవహరించేవారు. ఎప్పుడు ఎలా ఉండేవారో తెలియంది కాదు.
మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం వ్యతిరేకంగా ఉండేవారు. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపారు. మరోవైపు సమీప బంధువు, జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నియా శ్రీనివాసరావు సైతం చంద్రబాబుకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయారు. ఇలా సొంత కుటుంబ సభ్యులే చికాకుల మీద చికాకులు తెచ్చి పెట్టేవారు.

# పెట్టుబడిదారీ విధానంతో ప్రజాశ్రేయస్సా?

నాగరికతను నిలబెట్టేది మార్కెట్లు కావు, చట్టాలు కావు, భౌతిక సంపద అంతకంటే కాదు. ఒక మనిషి మరొక మనిషి బాధను తన బాధగా భావించే సామర్థ్యం మాత్రమే సమాజాన్ని కాపాడుతుంది. ఆ సామర్థ్యం ఉన్నంతకాలం మానవత్వం జీవిస్తుంది. అది క్షీణించిన రోజు ఎంత సంపన్నమైన పెట్టుబడిదారీ వ్యవస్థ అయినా లోపల నుంచి కూలిపోవడం ప్రారంభమవుతుందనీ అర్థశాస్త్ర పితామహుడు ఆడమ్ స్మిత్ తెలియజేసినారు. అంటే ఆడమ్ స్మిత్ మనకు చెప్పిన అత్యంత విలువైన పాఠం మార్కెట్ ఎకానమీ కాదు.. ప్రజా శ్రేయస్సు.. తన 'ఆన్ ఎంక్వయిరీ ఇన్ టూ నేచర్ అఫ్ వెల్త్ ఆఫ్ నేషన్స్' అనే గ్రంథాన్ని రాసేటప్పుడు (1776) పెట్టుబడి, మార్కెట్లు, లాభాల ద్వారా దేశాలు అభివృద్ధి చెందుతాయని నమ్ము కోవడం నిజమే కానీ ఆ తర్వాత రాసిన గ్రంథంలో 'ద థియరీ ఆఫ్ మోరల్ సెంటిమెంట్స్' ద్వారా సాటి మనిషి బాధను అర్థం చేసుకోకపోతే ఏ మార్కెట్ అయినా కుప్పకూలిపో తుందని ఆనాడే హెచ్చరించాడు. డబ్బు ప్రపంచాన్ని నడిపిస్తుందని మనం అనుకుంటాం. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థకు మేధోపరమైన పునాది వేసిన ఆడమ్ స్మిత్ మాత్రం మానవ శ్రేయస్సును నమ్మాడు. సాటి మనిషి బాధను అర్థం చేసుకునే సామర్థ్యం లేకపోతే ఏ మార్కెట్ అయినా చివరికి కూలిపోతుందని ఆడమ్ స్మిత్ నమ్మాడు. పెట్టుబడిదారీ వ్యవస్థకు పునాది వేసిన వ్యక్తి మార్కెట్ విధానాన్ని చివరి రోజుల్లో వ్యతిరేకించారు. మానవ నాగరికత ప్రయాణాన్ని అసలు ముందుకు నడిపించింది ఏమిటి? సంపదా? పోటీనా? లేక ఒకరి బాధను మరొకరు అర్థం చేసుకునే మానసిక సామర్థ్యమా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికే క్రమంలో మనం తరచుగా ఆర్థిక సూత్రాల వైపు చూస్తుంటాం. ఆడమ్ స్మిత్ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది మార్కెట్, లాభాలు, పోటీ, స్వప్రయోజనం. ఈ పరుగు పందెంలో మనం ఆయనను ఒక క్రూరమైన పెట్టు బడిదారీ విధానానికి చిహ్నంగా మార్చేశాం. లాభాల వేటను మాత్రమే ఆయన బోధించారని తప్పుగా నమ్మాం. 1776లో ఆడమ్ స్మిత్ 'యాన్ ఎంక్వైరీ ఇన్‌టు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్' అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఆధునిక అర్థశాస్త్రానికి అది పునాదిగా మారింది. వ్యక్తిగత ప్రయోజనం కోసం పనిచేసే వ్యక్తులు తమకు తెలియకుండానే సామాజిక ప్రయోజనానికి ఎలా దోహదపడతారో ఆయన వివరించారు. దీనినే తర్వాత ప్రపంచం 'ఇన్విజిబుల్ హ్యాండ్' లేదా అదృశ్య హస్తం అనే భావనగా స్వీకరించింది. ఈ సిద్ధాంతం పెట్టుబడిదారీ వ్యవస్థకు మేధోపరమైన బలాన్ని ఇచ్చింది. స్మిత్ మరో అద్భుతమైన గ్రంథాన్ని రాశారు. అదే 'ది థియరీ ఆఫ్ మోరల్ సెంటిమెంట్స్'. మోరల్ సెంటిమెంట్స్ పుస్తకాన్ని మాత్రమే మళ్లీ మళ్లీ తిరగేస్తూ, కొత్త విషయాలు చేరుస్తూ, విస్తరిస్తూ గడిపారు. చనిపోయే చివరి రోజు వరకు ఆయన ఈ పనిచేస్తూనే ఉన్నారు. నేడు ఆయనను అభిమానించే వారిలో చాలామంది ఈ పుస్తకాన్ని చదవకపోవడం ఒక చారిత్రక విషాదం.నిజానికి స్మిత్ ఆలోచనల అసలు హృదయం ఈ రచనలోనే దాగి ఉంది అనేది సత్యం.

# చాప కింద నీరులా కబలిస్తున్న సైలెంట్ కిల్లర్.!



ఈ భూమిపై ఒత్తిడి లేని వారు ఉండటం సాధ్యమే? అనేంతగా ఇదీ మన జీవితాలను ఆక్రమించింది. ఆర్థిక సమస్యలు, ఆఫీసు పని, కుటుంబ బాధ్యతలు వంటి వివిధ కారణాలు లోపలి నుంచి మనల్ని కుంగదీస్తూ ఉంటాయి. కానీ మీకు తెలుసా... మీరు అనుభవించే ఈ ఒత్తిడి మీకు తెలిసినా.. తెలియకపోయినా.. అకాల వృద్ధాప్యానికి దారితీస్తుంది. నేటి కాలంలో స్ట్రెస్ జీవితంలో ఒక భాగమైపోయింది. ఎంతగా అంటే.. ఈ భూమిపై ఒత్తిడి లేని వారు ఉండటం సాధ్యమే? అనేంతగా ఇదీ మన జీవితాలను ఆక్రమించింది. ఆర్థిక సమస్యలు, ఆఫీసు పని, కుటుంబ బాధ్యతలు వంటి వివిధ కారణాలు లోపలి నుంచి మనల్ని కుంగదీస్తూ ఉంటాయి. కానీ మీకు తెలుసా? మీరు అనుభవించే ఈ ఒత్తిడి మీకు తెలిసినా.. తెలియకపోయినా.. అకాల వృద్ధాప్యానికి దారితీస్తుంది. అవును.. అతిగా ఆలోచించడం వల్ల జుట్టు రాలడం నుంచి గుండె జబ్బుల వరకు అనేక సమస్యలు వస్తాయి. అంతేకాకుండా ఒత్తిడికి నిరంతరం గురికావడం వల్ల మన శరీరంలో 'కార్టిసాల్' వంటి ఒత్తిడి హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి. ఇవి విషం కంటే ప్రమాదకరమైనవి. గుండె, మెదడు, జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తాయి. ఆరోగ్యానికి హాని కలిగించే ఒత్తిడి వల్ల శరీరానికి ఏమి జరుగుతుందో? దానిని నివారించడానికి ఏమి చేయాలో? ఒత్తిడి పెరిగినప్పుడు, కార్టిసాల్, అడ్రినలిన్ అనే హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి. ఇది రక్తపోటుని పెంచుతుంది. గుండెపై ఒత్తిడిని కలిగిస్తుంది.ఒత్తిడి వల్ల అసిడిటీ, మలబద్ధకం, జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. కొంతమందికి ఆకలి తగ్గుతుంది. మరికొందరు అతిగా తిని బరువు పెరుగుతారు. స్త్రీలకు పీరియడ్స్ సమస్యలు ఎదురవుతాయి. పురుషులు హార్మోన్ల అసమతుల్యతను అనుభవించవచ్చు.

# ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించి సేవలు పెంచండి

## - సమీక్ష సమావేశంలో ట్రైనీ కలెక్టర్



**నిజామాబాద్ వైద్య విభాగం సెప్టెంబర్ 17 (ప్రజాగళం )**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరివివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించి నాణ్యమైన సేవలు అందించాలని, విధుల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, జవాబు దారి తనం కలిగి ఉండాలని, నాణ్యమైన సమాచారము, రిపోర్టులను, రికార్డులను కలిగి ఉండాలని అన్నారు. మన పరిధిలో కాపాడగలిగే ప్రతి ప్రాణాన్ని, మాతా శిశు మరణాలను కాపాడాలని అన్నారు. జిల్లా ఉప వైద్యాధికారులు, వైద్యాధికారులు, సూపర్వైజర్ అధికారులు, క్రమం తప్పకుండా ఆరోగ్య సేవలను రాండంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు ప్రతిరోజు గృహ సందర్శన చేయాలని తెలియజేశారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని విడివిడిగా ప్రత్యేక ఏజెండాతో సమీక్ష నిర్వహించాలన్నారు. పీహెచ్సీ స్థాయిలో అందించే అన్ని ఆరోగ్య సేవల రికార్డులను అప్డేట్ చేయాలని, రోగ నిర్ధారణ శిబిరాలను తరచుగా నిర్వహించాలని అన్నారు. విధుల్లో ఉన్న వైద్యాధికారులపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తించరాదని అట్లా ఎక్కడైనా సంభవిస్తే డిఎన్ఎచ్ఓ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. బయో మెడికల్ జీవ వ్యర్థాలను నియమ నిబంధనల కనుగుణంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏజెన్సీ వాహనాలలో మాత్రమే తరలించాలని ఎక్కడపడితే అక్కడ మునిసిపల్ చెత్త చెదారంలో వేయరాదన్నారు. ప్రతి ఆశ తన యొక్క విధుల గురించి తెలుసుకోవాలని, పీహెచ్సీల వారీగా సోషల్ మీడియా అకౌంట్లో నిర్వహించిన కార్యక్రమాలను



పోస్ట్ చేయాలన్నారు. ఏఎన్ఎం, అంగన్వాడి కార్యకర్తల మధ్య సమన్వయం పెంచుతూ శ్యామ్ మామ్ చిన్నారులను గుర్తించి, జి జి హెచ్ లోని ఎన్ఆర్సికి రిఫర్ చేసి చికిత్స అందించడమే కాకుండా వారిని ఫాలో అప్ చేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ గారు మాట్లాడుతూ ట్రైనీ కలెక్టర్ సూచించిన ప్రతి అంశాన్ని పరిశీలించి ప్రతి పీహెచ్సీ పరిధిలో అమలుపరుస్తామని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సూపరిండెంట్ (డిసిహెచ్ఎస్) డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ విద్య డాక్టర్ రవీందర్ డాక్టర్ సికందర్ వివిధ ఆరోగ్య కార్యక్రమాల ప్రోగ్రాం అధికారులు, వివిధ పీహెచ్సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఎడపల్లిలో మహాలక్ష్మి మందిరం వద్ద షెడ్డు నిర్మాణానికి సొంతంగా1లక్ష రూపాయలు విరాళం ఇచ్చిన సర్పంచ్





**ఎడపల్లి,సెప్టెంబర్ 17: (ప్రజా గళం)**ఎడపల్లి మండల కేంద్రంలోని మహా లక్ష్మి మందిరం వద్ద రేకుల షెడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్ గురువారం పెద్దల సమక్షంలో ఉత్సవ కమిటీకి లక్ష రూపాయ లు విరాళం ఇచ్చారు.రేకుల షెడ్డు తన సొంత ఖర్చులతో నిర్మాణం చేపడుతానని ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ రాంచందర్ తన మాట నిలబెట్టుకున్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి లక్ష రూపాయలు మహాలక్ష్మి ఉత్సవ కమిటీకి ఇవ్వడం జరిగింది అని సర్పంచ్ రాంచందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎడపల్లి సింగిల్ విండో చైర్మన్ పోలా మల్కారెడ్డి,నాయకులు కామప్ప, న్యావనంది సుభాష్,వెంకట్ రెడ్డి,వార్డు సభ్యులు దండి శంకర్, బర్దీపూర్ విఠల్,నాయకులు మల్లెపూల శ్రీనివాస్,భట్టు రాజు,మహాలక్ష్మి ఉత్సవ కమిటీ అధ్యక్షులు భట్టు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మంగల్ పహాడ్ లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి చేసిన తహసీల్దార్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సర్పంచ్..

### - పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి... బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్,తహసీల్దార్ దత్తాద్రి,సర్పంచ్ చేపూర్ వీణ శ్రీనివాస్ గౌడ్ వెల్లడి...


**ఎడపల్లి,సెప్టెంబర్ 17: (ప్రజా గళం)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నటు వంటి స్మార్ట్ రేషన్ కార్డులను గురువారం ఎడపల్లి మండలం మంగల్ పహాడ్ గ్రామంలో మండల తహసీ ల్దార్ దత్తాద్రి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్,సర్పంచ్ చేపూర్ వీణ శ్రీనివాస్ గౌడ్ లు లబ్ధిదారులకు పంపిణి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజా పంపిణి ద్వారా పేదలకు ప్రభు త్వం సన్న బియ్యం పంపిణి చేస్తోందని,పేదలు కడుపు నిండా అన్నం తినగలుగుతున్నారని అన్నారు.స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో భద్రతగా ఉంటాయని అన్నారు. ప్రభుత్వం కొత్తగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులు గ్రామానికి సుమారు 704 రేషన్ కార్డులు వచ్చాయాని అన్నారు.ఈ సందర్భంగా రేషన్ వినియోగదారులకు వారి పేర్ల ఆధారంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి చేస్తామని వారు తెలిపారు.గ్రామంలో డ్రైనేజిలు,కల్వ ర్టులు నిర్మాణం పనులు చేపట్టెందుకు ప్రతిపాదనలు రూపొందించడం జరిగింది అని,పాలకవర్గ సమావేశం నిర్వహించి గ్రామంలో చేపట్టే అభివృద్ధి పై చర్చించి పనులు చేపడుతామని సర్పంచ్ చేపూర్ వీణ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.గ్రామంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో నిధులు రాబట్టి అభివృద్ధి పనులు చేపట్ట డం జరుగుతుంది అని ఆమె తెలిపారు.గత 10 సంవ త్సరాల ప్రభుత్వ హయంలో పనులు కాంగ్రెస్ ప్రభు త్వంలో జరుతున్నాయని అన్నారు.గత ప్రభుత్వ హయంలో పేదలకు రేషన్ కార్డులు పంపిణి చేయలేదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంవత్స రంన్నరలోనే పేదలకు అందరికి రేషన్ కార్డులు ఇవ్వడం జరిగింది అని,ప్రస్తుతం వాటి స్థానంలోనే కొత్తగా స్మార్ట్ కార్డులు పంపిణి చేస్తున్నట్లు అయన చెప్పారు.రెండు నెలల క్రితం 9 వేల కోట్ల రూపాయలు రైతుల బకాయి లు ప్రభుత్వం చెల్లించిందని అన్నారు.రైతు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించడం జరిగిందని,అలాగే పెట్టుబడి సహాయం 6 వేలు ఇవ్వడం జరిగింది అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్ తెలిపారు. గ్రామంలో ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టెందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బట్టు బాబయ్య,పంచా యతీ కార్యదర్శి అలీ,జిపిఓలు నీరడి లక్ష్మణ్,కిరణ్, వార్డు సభ్యు లు వంగ గంగప్రసాద్,బుడ్డ అబ్బయ్య, బండ అభిలాష్, గాండ్ల స్రవంతి,సురకత్తి



స్వప్న,దెగ్లూ రు సుమన్,అంగన్ వాడి టీచర్లు,ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కోటలో ఎంబిబిఎస్ సీటు సాధించిన ఎడపల్లి గ్రామానికి చెందిన వడ్ల మాదూరి....

### ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఉత్తిర్ణత సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం...



ఎడపల్లి,సెప్టెంబర్ 17: (ప్రజా గళం)ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన తల్లిదండ్రులైన వడ్ల రాధాకృష్ణ మణిమాల కూతురైనా వడ్ల మాదూరి కష్టప డి చదివి ప్రభుత్వ కోటాలో ఎంబిబిఎస్ సీటు సాధించా రు.గ్రామానికి చెందిన స్వర్గీయ, వడ్ల రాంచందర్ రమ ణల మనవరాలు ,వడ్ల మాదూరి వికారాబాద్ లో ప్రభు త్వ కోటలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించడంతో కుటుం బ సభ్యులు,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.పట్టుద లతో చదివి వైద్య విద్యలో సీటు సాధించిన మాధురిని పలువురు అభినంది ంచారు.భవిష్యత్తులో వైద్యురాలి గా సేవలందించాలని ఆకాంక్షించారు.

# దివ్యాంగుల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

### - కేంద్ర నిధులతో వెయ్యి మంది లబ్ధిదారులకు ప్రయోజనం.

### - కేంద్ర మంత్రి డా. వీరేంద్ర కుమార్‌కు ఎంపీ అర్వింద్ ధర్మపురి కృతజ్ఞతలు.





**నిజామాబాద్, సెప్టెంబర్ 17( ప్రజాగళం ప్రతినిధి )సెప్టెంబర్ 17**ను సేవా దినంగా భావిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ జన్మదినాన్ని పురస్కరించుకుని దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయక పరికరాలు అందించడం ఎంతో అర్థవంతమైన కార్యక్రమమని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దివ్యాంగులకు సానుభూతి కాదు.. అవకాశాలు,గౌరవం, సాధికారత అవసరమని ఎంపీ స్పష్టం చేశారు. సహాయక పరికరాలు వారి స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవానికి సాధనాలని పేర్కొన్నారు.నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రూ. 2.10 కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు 1,000 మంది దివ్యాంగులు, వయోవృద్ధులకు వివిధ రకాల సహాయక పరికరాలు అందించడం ద్వారా ప్రయోజనం చేకూరనుందని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో 19 రకాల సహాయక పరికరాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డా. వీరేంద్ర కుమార్‌కు ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సహాయం మరింత చేరువ అవుతోందన్నారు.నిజామాబాద్ నార్త్, ఆర్మూర్, బోధన్, జగిత్యాల కోరుట్ల ప్రాంతాల్లో ఇప్పటికే సుమారు 1000 మంది దివ్యాంగులను గుర్తించామని, మిగిలిన అర్హుల గుర్తింపు ప్రక్రియను కూడా కొనసాగిస్తామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఉన్న అర్హులెవరూ ప్రభుత్వ సహాయానికి దూరం కాకుండా చూడాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ , జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి , స్రవంతి రెడ్డి , ప్రమోద్ , కార్పొరేటర్లు నాగొల్ల లక్ష్మీనారాయణ, వైష్ణవి సుధా, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, మహిళా శిశు వికలాంగుల శాఖ జిల్లా అధికారి సౌందర్య, అలింకో ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

### - మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 17 ( ప్రజాగళం)**జిల్లా కేంద్రంలోని పద్మా నగర్ లోని విశ్వబ్రాహ్మణ సంఘం లో శ్రీ విరాట్ విశ్వకర్మ మహోత్సవ కార్యక్రమాన్ని అధ్యక్షులు వడ్ల భాస్కర చారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరము ఆయన విశ్వ కర్మలను ఉద్దేశించి ప్రసంగించారు. భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ లోక కళ్యాణర్థమై ఉద్భవించాడని ఆయన జయంతిని విశ్వకర్మలు ప్రతి ఏడాది జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. విశ్వకర్మలకు శ్రీ భగవాన్ విరాట్ దైవ సమానులని, ఇందులో భాగంగానే ప్రతి ఏడాది ఆయన జయంతిని మహోత్సవంతో జరుపుకుంటున్నారనీ అన్నారు. ఈ సందర్భంగా తాను విశ్వకర్మలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. విశ్వకర్మలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు వడ్ల భాస్కర చారి, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి మహేశ్వర చారి కోశాధికారి కాశ రాజశేఖర్, గౌరవ అధ్యక్షులు గుగ్గిళ్ళ విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు శ్యామల్ల పల్లి బిక్షపతి, కార్యవర్గ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పోలీస్ కార్యాలయం ఆవరణలో ఘనంగా

### - ప్రజాపాలన దినోత్సవ వేడుకలు.

### - జాతీయ జెండాను ఆవిష్కరించిన సీపీ సాయి చైతన్య.





**నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 17( ప్రజాగళం )**తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం పోలీస్ లైన్ ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు స్వీట్ ప్యాకెట్స్ మరియు నోట్ బుక్స్ లు , పెన్ లు పంపిణీ చేశారు. ఈ వేడుకలలో అదనపు డి.సి.పి ( అడ్మిన్ ) ఎన్. శుభం ప్రకాష్ , నిజామాబాద్ ఎసీపీ ప్రకాష్ , ఎ.ఆర్. ఎ.సి.పి కృష్ణ , ట్రాఫిక్ ఎ.సి.పి మస్తాన్ అలీ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , సి.ఐ లు , ఆర్.ఐ లు , ఎస్.ఐ లు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది , ఐటి కోర్ , సెంట్రల్ కాంప్లె సెల్ , స్పెషల్ బ్రాంచ్ , సిసిఆర్.బి , సైబర్ క్రైమ్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడపల్లి మండలంలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల పై అధికారులతో సమావేశం నిర్వహించిన తహసీల్దార్ దత్తాద్రి....

### - ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలి....తహసీల్దార్...శాంతి భద్రతల పరిరక్షణ పోలీసులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారు....బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు...

**ఎడపల్లి,సెప్టెంబర్ 17: (ప్రజా గళం)**ఎడపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాల యంలో గురువారం మండలంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై మండల తహసీల్దార్ దత్తాద్రి అధ్యక్షతన వివిద శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.మండలంలోని పంచాయతీ సెక్రెటరీలు,గ్రామపాలన అధికారులు,వ్యవసాయ శాఖ,స్థానిక ఎస్ఐ బోధన్ రూరల్ సిఐలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ వివిద గ్రామాలలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘ టనలు జరగకుండా చూడాలని కోరారు. గ్రామాలలో నిమజ్జనం కు కావలసిన ఏర్పాట్లను అధికారులు పరిశీ లించి చర్యలు తీసుకోవాలని అన్నారు.రోడ్లు గుంతల మయం లేకుండా చూడాలని,ఊరేగింపు మార్గంలో ఇబ్బందులు లేకుండా మార్గాలను క్లియర్ చేయాలని తహసీల్దార్ సూచించారు.గణేష్ ఊరేగింపు సమయం లో గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చూడాలని,ఇందుకు పోలీసు శాఖ తరపున తమ వంతు సహకారం ఎల్లప్పుడూ వుంటుందని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు తెలిపారు.రాత్రింబ




వళ్లు తమ సిబ్బంది ప్రతీ గ్రామాన్ని సందర్శించి శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారని,అనుమానస్పద వ్యక్తు ల సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియ జేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు,ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమ, వ్యవసాయ శాఖ అధికారి సిద్దిరామేశ్వర్,ఎంపిడిఓ శంకర్,ఎంపిఓ మన్మోహన్ శాస్త్రి,ఐకేపి ఎపిఎం.రాజేంద ర్,గ్రామ పంచాయతీ కార్యదర్శులు,జిపిఓ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవో లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

### - జాతీయ జెండాను ఎగరవేసిన జిల్లా అధ్యక్షులు సుమన్

**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 17 (ప్రజా గళం )**తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం టిఎన్జీవో జిల్లా కార్యాలయ ఆవరణలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు.ఈ కార్యక్రమానికి వీరితోపాటు టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ ,రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్,జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్యక్షులు సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, అర్బన్ యూనిట్ కార్యదర్శి మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, రాజేశ్వర్, టీఎన్జీవో



ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్ ,క్లాస్ ఫోర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాలేయం ఆరోగ్యానికి వ్యాయామాలు....



శరీరంలోని ప్రతి భాగం చాలా ముఖ్యమైనది. కానీ ఈ యంత్రం ఇంజిన్ బలహీనంగా మారితే ఏం జరుగుతుంది? మన శరీరంలో కాలేయం ఎంతో ముఖ్యమైది. ఇది శరీరంలోని అతి ముఖ్యమైన, కష్టపడి పనిచేసే అవయవాలలో ఒకటి.


కాలేయం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడటమే కాకుండా శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడానికి కూడా పనిచేస్తుంది. వేయించిన ఆహారాలు, ఒత్తిడి క్రమంగా కాలేయాన్ని బలహీనపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. మందుల సహాయం తీసుకునే ముందు కాలేయాన్ని లోపలి నుండి బలోపేతం చేసే కొన్ని వ్యాయామాల గురించి తెలుసుకుందాం. ఇది కాలేయానికి అత్యంత ప్రభావవంతమైన యోగా ఆసనం అని భావిస్తారు. ఈ ప్రాణాయామంలో వేగంగా గాలి వదులుతూ కడుపు లోపలికి, బయటకు కదిలిస్తూ ఉంటుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. రోజూ 5-10 నిమిషాలు కపలాభతి చేయడం వల్ల కాలేయ పనితీరు మెరుగుపడుతుంది.

## రక్తపోటు సరిగ్గానే చెక్ చేసుకుంటున్నారా?



రక్తపోటు తరచూ ఇంట్లోనో లేక ఆస్పత్రికి వెళ్లో చెక్ చేసుకోవడం నేటి కాలంలో సాధారణం అయిపోయింది. ముఖ్యంగా బీపీ చెకింగ్‌కి చాలా మంది ఇంట్లోనే చెక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తపోటును తనిఖీ చేయడంలో కొన్ని తప్పులు చేస్తుంటారు. దీని వల్ల తప్పుడు రీడింగ్ వస్తుంది. నేటి జీవన శైలి కారణంగా చిన్న వయసులోనే బీపీ, డయాబెటిస్ పలకిరిస్తున్నాయి. దీంతో తరచూ వీటిని ఇంట్లోనో లేక ఆస్పత్రికి వెళ్లో చెక్ చేసుకోవడం పరిపాటై పోయింది. ముఖ్యంగా బీపీ చెకింగ్‌కి చాలా మంది ఇంట్లోనే చెక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తపోటును తనిఖీ చేయడంలో కొన్ని తప్పులు చేస్తుంటారు. దీని వల్ల తప్పుడు రీడింగ్ వస్తుంది. జనరల్ ప్రాక్టీషనర్ డాక్టర్ విశాఖ ఖచ్చితమైన రీడింగ్ పొందడానికి అనుసరించే పద్ధతి గురించి చెబుతున్నారు. సాధారణంగా రక్తపోటును తనిఖీ చేసేటప్పుడు తెలిసో.. తెలియకో.. చేసే తప్పులు రీడింగ్‌ను ఎలా పెంచుతాయో లేదా తగ్గిస్తాయో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వివరించారు. శారీరక శ్రమ లేదా భావోద్వేగ ఒత్తిడి తర్వాత వెంటనే రక్తపోటును కొలవడం సాధారణంగా అందరూ చేసే తప్పు. ఇది సిస్టోలిక్ రక్తపోటును తప్పుగా పెంచుతుంది. ఇటువంటి రీడింగ్‌లు వ్యక్తి వాస్తవ బేస్‌లైన్ స్థాయిలను వెల్లడించదు. బీపీ చెకప్ చేసుకునే ముందు ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం మంచిది. చెకప్ సమయంలో కూర్చునే తప్పుడు భంగిమ కూడా రీడింగ్‌ను ప్రభావితం చేస్తుంది. కాళ్ళు అడ్డంగా పెట్టుకుని, వేలాడిస్తూ.. తగినంత వీపు మద్దతు లేకుండా కూర్చున్నప్పుడు రక్తపోటు రీడింగ్‌లు 10 ఎఎంహెచ్ నుంచి 15 ఎఎంహెచ్ వరకు పెరుగుతాయి. రీడింగ్ సమయంలో వీపు భాగం కుదురుగా ఉంచాలి. రెండు పాదాలు నేలపై ఉంచాలనే విషయాలు నిర్ధారించుకోవాలి. ఇలా చేస్తే చెకప్ సక్రమంగా ఉంటుంది. చేయి వేలాడదీయడం లేదా సపోర్ట్ లేకుండా ఉండటం మరొక సాధారణ తప్పు. చేయి గుండె స్థాయి కంటే తక్కువగా ఉంచినట్లయితే తప్పుగా అధిక రక్తపోటు రీడింగ్ వస్తుంది. అదేవిధంగా చేయి చాలా ఎత్తుగా పైకి లేపినా తప్పుగా తక్కువ రీడింగ్ వస్తుంది. చేయి గుండె స్థాయిలో సౌకర్యవంతంగా ఉండేలా ఉంచాలి. ఇది రక్తపోటును కొలవడానికి సరైన భంగిమ. కఫ్ సైజు అనేది రక్తపోటు రీడింగ్‌లను ప్రభావితం చేసే మరో ముఖ్యమైన అంశం. చాలా చిన్నగా ఉన్న కఫ్ తప్పుగా రీడింగ్‌లను పెంచుతుంది. అలాగే పెద్దగా ఉన్న కఫ్ కూడా తప్పుగా తక్కువ రీడింగ్‌కు దారితీస్తుంది. ఖచ్చితమైన కొలత కావాలంటే చేయి చుట్టుకొలతకు తగిన కఫ్‌ను మాత్రమే ఉపయోగించాలి.

## భోజనం తర్వాత తాంబూలం అలవాటు ఉందా?



పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. భారతీయ సంస్కృతిలో తమలపాకులకు విశేష ప్రాముఖ్యత ఉంది. పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి, దుర్వాసనను తొలగించడానికి, శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి సహాయపడతాయి. అందుకే ఇంట్లో పెద్ద వాళ్లు భోజనం తర్వాత తమలపాకులను నమలుతారు. తమలపాకులలో ఉండే పోషకాలు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం, ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి బయటపడటానికి కూడా ఇది సహాయపడుతుంది. ప్రతిరోజూ భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది మీ మనసును ప్రశాంతంగా ఉంచి మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అల్సర్ వంటి తీవ్రమైన సమస్యల నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది.

నోటి దుర్వాసన అనేది చాలా మంది ఎదుర్కొనే ఒక సాధారణ సమస్య. తమలపాకులను నమలడం వల్ల దుర్వాసన తొలగిపోతుంది. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటిలో దుర్వాసనకు ప్రధాన కారణమైన హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గిస్తాయి. ఇది అద్భుతమైన సహజ మౌత్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది.పంటి నొప్పి, చిగుళ్ళలో రక్తస్రావం వంటి సమస్యలకు తమలపాకులు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. తమలపాకులలో విటమిన్ సి ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో నమలడం వల్ల చిగుళ్ళు బలపడతాయి. దంత సమస్యలు తొలగిపోతాయి. తమలపాకులలో టానిన్లు, ప్రొపేన్ ఉంటాయి. ఇవి శరీరం నుంచి విషాన్ని తొలగించి ఆరోగ్యకరమైన శరీరాన్ని నిర్వహించడంలో సహాయపడతాయి.

## మెంతులు.. ఆరోగ్యానికి అద్భుతం కానీ!




మెంతులు తెలుగు ఇంటి వంటల్లో దాదాపు తప్పనిసరి పదార్థం. జీర్ణక్రియ మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడం, జుట్టు ఆరోగ్యం, చర్మ సౌందర్యం - ఇలా అనేక ఆయుర్వేద గుణాలకు ప్రసిద్ధి చెందిన ఈ చిన్న గింజలు రోజువారీ ఆహారంలో భాగమే. కానీ ఇటీవలి అధ్యయనాలు, నిపుణుల హెచ్చరికలు ఈ మెంతుల వాడకం గురించి కొత్త కోణాన్ని చూపుతున్నాయి. గర్భిణీ స్త్రీలు మెంతులను అధికంగా తీసుకుంటే గర్భస్థ శిశువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మొదటి త్రైమాసంలో మెంతుల్లోని కొన్ని సమ్మేళనాలు గర్భాశయ సంకోచాలను ప్రేరేపించి అకాల గర్భస్రావం రిస్క్‌ను పెంచుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, అతి తక్కువ సందర్భాలలో అరుదైన జన్యు వ్యాధి అయిన మాపుల్ సిరప్ యూరిన్ డిసీజ్ బిడ్డకు వచ్చే ప్రమాదం కూడా లేదని అనిపించదు. ఇక రొమ్ము క్యాన్సర్ ఉన్న లేదా రిస్క్‌లో ఉన్న మహిళల విషయంలో మెంతులు మరింత జాగ్రత్త అవసరం చేస్తాయి. మెంతుల్లో ఫైటోఈస్ట్రోజెన్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి, ఇవి శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్‌ను అనుకరిస్తాయి.

## అందుకే పిల్లలను వద్దనుకున్నా...



చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి అనుపమ పరమేశ్వరన్, ఇటీవల తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అత్యంత చేదు అనుభవాలను బయటపెట్టి సంచలనం సృష్టించారు. గతంలో తాను ఒక వ్యక్తితో ప్రేమలో ఉన్న సమయంలో అనుభవించిన తీవ్రమైన మానసిక క్షోభను గుర్తుచేసుకుంటూ ఆమె ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ మాట్లాడుతూ.. ఒక మహిళగా, ఒక నటిగా సమాజంలో ఎంతో ధైర్యంగా నిలబడాలని ప్రయత్నించిన తనకు, తన మాజీ ప్రియుడి ప్రవర్తన వల్ల తనపై తనకే సిగ్గుచేటుగా అనిపించే పరిస్థితి వచ్చిందని ఆమె తెలిపారు. ప్రతి నెలా ఒక స్త్రీగా సహజంగా జరిగే పీరియడ్స్ ప్రక్రియను కూడా అతడు చాలా చులకనగా చూసేవాడని వెల్లడించారు. తాను ఏ రోజైనా అతని తప్పులను ప్రశ్నించడానికి ప్రయత్నిస్తే, వెంటనే నీకు పీరియడ్స్ సమయమా లేక ఇంకా రాలేదా అని ప్రశ్నిస్తూ, ఇదంతా కేవలం మూడ్ స్వింగ్స్ వల్ల మాత్రమే అని చాలా తేలిగ్గా కొట్టిపడేసేవాడని చెప్పారు. ప్రతిసారీ ఆ రకమైన వ్యాఖ్యలు విన్నప్పుడు ఒక మహిళగా పుట్టినందుకే కదా ఇలాంటి మాటలు అనిపించుకోవాల్సి వస్తోందని, తన ఉనికిపై తనకే అసహ్యం వేసేదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషపూరితమైన రిలేషన్‌షిప్ వల్ల తన జీవిత లక్ష్యాలు, ఆలోచనలు కూడా పూర్తిగా మారిపోయాయని అనుపమ ఆవేదన చెందారు. చిన్నప్పటి నుంచి తనకు 11 మంది పిల్లలు ఉండాలని ఎంతో ఆశగా కలలు కనేదాన్ని అని, కానీ ఆ వ్యక్తితో గడిపిన రెండేళ్ల కాలం తర్వాత, భవిష్యత్తులో అసలు పిల్లలే వద్దు అనే తీవ్రమైన నిర్ణయానికి వచ్చేలా తన ఆలోచనలను దిగజార్చాడని తెలిపారు. అతడి ప్రవర్తన వల్ల తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయానని, ఆ చేదు జ్ఞాపకాల నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని చెప్పారు. ప్రస్తుతం అనుపమ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## పెళ్లి అయిన హీరోయిన్ల కెరీర్‌ను తొక్కేస్తున్నారు



టాలీవుడ్ స్టార్ బ్యూటీ కాజల్ అగర్వాల్ సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ వరుస ఆఫర్లతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఇటీవల ఆమె నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద రాణించలేకపోయినా, ఈ చందమామకున్న క్రేజ్, డిమాండ్ మాత్రం రవ్వంతైనా తగ్గడం లేదు. ప్రస్తుతం దర్శకుడు నితీష్ తివారీ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా విజువల్ వండర్ 'రామాయణ'లో కాజల్ మండోదరి పాత్రలో కనిపించబోతున్నారు. ఈ బిగ్ ప్రాజెక్ట్ షూటింగ్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతుండగా, దీపావళి పండుగ కానుకగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది.

అయితే ఈ సినిమా షూటింగ్ హడావుడిలో ఉన్న కాజల్, తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సినీ ఇండస్ట్రీలో నటీమణులు ఎదుర్కొంటున్న పరిస్థితులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్ల పట్ల పరిశ్రమ చూపే వివక్షను బయటపెడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగానే సినిమా రంగంలో పురుషులతో పోలిస్తే నటీమణులే ఎక్కువ సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ విషయంలో తనకు కొంత అసంతృప్తి కూడా ఉందని కాజల్ స్పష్టం చేశారు. పరిశ్రమలో ఒక నటికి పెళ్లి కాగానే ఆమె లైఫ్ లేదా కెరీర్ అక్కడితో ముగిసిపోయిందని చాలామంది భావిస్తుంటారని కాజల్ అన్నారు. నటీమణులకు మార్కెట్‌లో మంచి డిమాండ్, క్రేజ్ ఉన్నప్పటికీ.. పెళ్లయ్యాక వారిని ఉద్దేశపూర్వకంగానే పక్కనపెట్టి, వారి కెరీర్‌ను అణచివేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని సంచలన నిజాలు వెల్లడించారు. ఇటువంటి వివక్షతతో కూడిన పరిస్థితులు పరిశ్రమలో త్వరలోనే మారాలని కోరారు. ప్రతిభ ఉన్న నటీమణులకు వయస్సు లేదా పెళ్లి అనేవి ఎప్పటికీ అడ్డంకి కాకూడదని, నిజమైన టాలెంట్ ఉన్న నటీమణులు ఏ వయసులోనైనా అద్భుతంగా నటించగలరని కాజల్ పేర్కొన్నారు. ప్రస్తుతం కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి.

## మోహన్‌లాల్ జోరు మామూలుగా లేదుగా..



మలయాళ స్టార్ సీనియర్ నటుడు మోహన్ లాల్.. ఇండియా వ్యాప్తంగా ఉన్న ఇతర సీనియర్ స్టార్ హీరోలతో పోలిస్తే అద్భుతమైన జోష్ చూపిస్తున్నారు. ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పి చాలామంది సీనియర్ హీరోలకు షాక్ ఇచ్చారు. మోహన్ లాల్ ఒకే రోజు ఏకంగా ఏడు సినిమాలకు కమిట్ అయ్యారు. వాటిలో జీతూ జోసఫ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాతో పాటు ప్రియదర్శన్, విష్ణు మోహన్, దిలీశ్ పోతన్, సత్యన్, జూడ్ ఆంథనీ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలు ఉన్నాయి. ఇలా ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పడంతో మోహన్ లాల్ తన అభిమానులను వరుస సినిమాలతో అలరించబోతున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పి చాలామంది సీనియర్ హీరోలకు షాక్ ఇచ్చారు. మోహన్ లాల్ ఒకే రోజు ఏకంగా ఏడు సినిమాలకు కమిట్ అయ్యారు. ఇక మోహన్ లాల్ తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో 'ఎగ్జైటింగ్ స్టోరీలతో ఆసక్తికరమైన జర్నీకి సిద్ధమవుతున్నాను' అంటూ పోస్ట్ చేశారు. దీంతో ఆయన నుంచి రాబోయే తదుపరి చిత్రాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింతగా పెరిగింది.

## నిజాయితీనే ప్రేక్షకులు గుర్తిస్తారు!



"సోషల్ మీడియా ట్రెండ్‌లను పాటిస్తూ.. ఇతరుల అంచనాలను అందుకోవాలని చేసే ప్రయత్నాలు మనల్ని మనం కోల్పోయేలా చేస్తాయ"ని అంటున్నారు కథానాయిక రష్మిక. ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నా వ్యక్తిగత ప్రయాణంలో ఉన్నది ఉన్నట్లు పంచుకోవడానికి ఎప్పుడూ ఇష్టపడతాను. సామాజిక మాధ్యమాల్లో ప్రేక్షకులు నన్ను చూసేది నిజజీవితంలో నేను ఎలా ఉంటానో దానికి దగ్గరగా ఉంటుంది. ట్రెండ్‌ల ప్రభావానికి లోనవకుండా ఒక నిర్దిష్టమైన ఇమేజ్‌లో ఇమడటానికి ఎక్కువగా ప్రయత్నించనప్పుడు ఇలాంటి సహజమైన వ్యక్తిత్వం వస్తుంది.

బహుశా అదే నేనిలా ఉండడానికి సహాయపడుతుందని భావిస్తున్నా. మనం ఎలా ఉండాలో నిరంతరం చెబుతూ ఉండే ప్రపంచంలో బతుకుతున్నాం. ఇతరుల అంచనాలను అందుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు సోషల్ మీడియా, ట్రెండ్‌లు, అభిప్రాయాలు మనల్ని మనం కోల్పోయేలా చేస్తాయి. అందుకే నా దృష్టిలో సక్సెస్ అంటే ఫర్‌ఫెక్ట్ ఇమేజ్ కాదు.. ఎంత ఎదుగుతున్నా సరే మనం మనలా ఉంటూ ప్రేక్షకులతో నిజాయతీగా ఉండడమే. అలాంటి నిజాయతీని ఎప్పటికైనా ప్రేక్షకులు గుర్తిస్తారు. నటిగా ఉండడం వల్ల అంచనాలు, విమర్శలనేవి సహజం. అందరి అభిప్రాయాలను నియంత్రించలేమని, కానీ వాటికి ఎలా స్పందిస్తామన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంటుందని కాలక్రమేణా తెలుసుకున్నా. నా పనిపై దృష్టి పెట్టడం. వ్యక్తిత్వానికి కట్టుబడి ఉండడం, నా ప్రయాణమే నా గురించి చెప్పేలా చేసుకోవడం నాకు ఇష్టమ"ని అన్నారు. ఇటీవలే 'మైసా' చిత్రీకరణలో గాయపడిన రష్మిక విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'రణబాలి', 'మైసా' చిత్రాలున్నాయి

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com